శ్రీ రమణ జ్యోతి

జనవరి 2021

Sri Ramana Jyothi

January 2021

ఈ సంచికలో ...

IN THIS ISSUE ...

| | | | |
|---|---|---|---|
| 1. | డా॥ కే.యస్. గారి 78వ ప్రవచనం | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| 2. | శరణాగతి | డా॥ వి. రామదాస్ మూర్తి | 15 |
| 3. | శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు (శ్రీ దేవరాజ ముదలియార్) | జి. శ్రీహరిరావు | 20 |
| 4. | శ్రీరమణ మహర్షి భక్తాగ్రేసరులు | మల్లాది ఫణిమాల | 25 |
| 5. | The Kingdom of Happiness is Within | Dr. K. Subrahmanian | 30 |
| 6. | Kavyakantha's Ramana Chatvarimsat | V. Krithivasan | 36 |
| 7. | The Human dimension of Bhagavan Sri Ramana Maharshi | G. Sri Hari Rao | 40 |
| 8. | LEST WE FORGET Sri Siddula Sambamurthy | G. Sri Hari Rao | 41 |
| 9. | Glimpses from the Diary | N.N. Rajan | 47 |
| 10. | Choiceless Awareness | Sneha Choudhury | 50 |

## Events in Sri Ramana Kendram in January 2021

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
3. 27th - Wednesday - Punarvasu Satsang - 6.00 - 7.00 p.m.

(Devotees may please note that due to Social distancing, satsangs are being held online. For details please contact Kendram Office)

***Sri Ramana Jyothi wishes its Readers***
***A Very Happy & Prosperous New Year 2021***

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# గురుకృప ఘనమైనది

డా॥ కే.యస్. గారి 78వ ప్రవచనం

అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

మీ చిన్న కూతురు లేదా మనుమరాలు, ఏదైన క్రొత్త పద్యాన్ని నేర్చుకునివుంటే, ఆ విషయాన్ని గొప్పగా చెప్పుకొనేందుకు "మీకు ఇది తెలుసా" అని అడగవచ్చు. బిడ్డను ప్రోత్సహించడానికి "అబ్బే, నాకు తెలీదు, కొంచెం చెబుతావా" అని అడుగుతాం. మీకు తెలియనిది తనకు తెలుసునని భావించి ఎంతో గర్వంగా ఆ పద్యాన్ని అప్పజెబుతుంది. అంతటితో ఆగక "నీకు ఈ పద్యం తెలీదా" అని అడిగి, మీరు తెలియదన్నప్పుడు, ఆ సంగతి విని ఎంతో మురిసి పోతుంది. మరింత ఉత్సాహంగా అందరితో ఆ విషయాన్ని తెలియజేస్తుంది. ఇదంతా గమనించి మీరు సంతోషిస్తారు. చిన్నబిడ్డ ఆనందం కోసం మీరు అలాగ నటిస్తారు. మీకు తెలియని పద్యం తన ద్వారా మీకు తెలిసిందని తాను ఎంతో పొంగి పోతుంది.

## బాధల్లో గురువు జ్ఞాపకం

మనం ప్రేమించేవారి కోసం ఎన్నో పనులను చేస్తుంటాం. అదే ఇతరుల కోసం అలా చేయం. తరచు, మనం దుఃఖం లేదా నిస్పృహతో వున్నప్పుడు మనం మన గురువు లేదా దేవునితో, "నేను ఎంత బాధపడుతున్నానో తెలియడం లేదా స్వామీ. ఈ విషయంలో మీరేమీ చేయలేరా?" అని మొరపెట్టుకుంటాం. అదే సజీవ

గురువైతే "ఏమి జరుగుతోందో నాకు తెలుసు" అనరు. అందుకు బదులు "అలాగా" అంటూ ఎన్నో ప్రశ్నలు అడుగుతారు. ఆయనకు ఏమీ తెలీదు అనుకుంటూ మన హృదయం విప్పి అన్నీ విశదంగా చెబుతాం. ఆయన పలకడు. ఊరికే వింటాడు. గురువు ఏమీ చెప్పనప్పుడు మనకు బాధ కలుగుతుంది. "ఏమిటిది? నా సమస్యల గురించి ఇన్ని చెబితే, తాను ఏమో చేస్తానని చెప్పరేం? గురువు ఏమైనా చేయగలరా అన్న అనుమానం వస్తుంది. కొన్ని సమయాలలో గురువు అనుకోవడం అంతా ఒక భ్రమ అనిపిస్తుంది. ఎందుకంటే మనం ఎంతో బాధపడుతున్నప్పుడు మరొక వ్యక్తి ఏమి చేయగలరని ఎలా అనుకోగలం? కొంత కాలం తరువాత ఒక సమస్యతో మరొక గురువు దగ్గరకు వెళతాం. ఆయన కూడ ఏమీ చెప్పలేదు, చెయ్యలేదు. గురువును ఆశ్రయించడం అర్థం లేనిదనీ, మనమే ఏదో పరిష్కరించుకోవాలనీ ఇతరులకు చెబతాం.

ఇది మానవనైజం. ఏమి జరుగుతున్నదీ గురువుకు తెలియదనుకుంటాం. మనం కూడ తండ్రి, తాతలకు పద్యం తెలియదనుకునే చిన్నబిడ్డలాంటి వాళ్ళం. అప్పుడప్పుడు అకస్మాత్తుగా, మనం అసలు అనుకోని సమయంలో సమస్యల మధ్య మనకు శాంతి లభిస్తుంది. మన పరిమితుల కారణంగా, కొంత కాలం శాంతి లభించడమన్నది గురుకృప కారణంగానే అని మనం గ్రహించలేము. మనం గురువు సమక్షంలో వున్నప్పటికీ, సమస్యలు సమసిపోకపోవచ్చు, తొలగిపోకుండ వుండవచ్చు. మనం మాత్రం గురువు ఏమి చేయగలడు, చేయలేకపోవచ్చునన్న

సందిగ్ధంలో కొట్టుమిట్టులాడుతుంటాం. కాని మనకు తెలియకనే, మనం ఈ సమయమంతట మనం గురువును గురించి ఆలోచిస్తూ వుంటాం. గురువును గురించి ఆలోచింపజేసేది గురువేనన్న విషయం ఎప్పుడో గాని గుర్తించం.

## గుప్తంగా శ్రద్ధ

తన బిడ్డ గురించి తల్లి ఎంత శ్రద్ధ తీసుకుంటుందో బిడ్డతో చెప్పదు. మన ప్రేమ, అభిమానం వున్న వ్యక్తితో ఆ విషయమై ఎక్కడా పెద్దగా చెప్పడం అవసరం వుండదు. అవతలి వ్యక్తికి అది తెలిసే వుంటుంది. నిజమైన గురువు తమకు మనపట్ల వున్న గొప్ప అభిమానం గురించి చెప్పరు. ప్రతి రోజు మనకు ఎలా మేలు చేస్తున్నాడో చెప్పుకోడు. గురువు పనిచేసే తీరు మాటల్లో వర్ణింప వీలు కాదు. ఆయన పట్ల స్థిరమైన నమ్మకం ఏర్పరచుకున్నప్పుడు, ఆయన కృపతో మన సమస్యల పట్ల ప్రస్తుతం చింతిస్తున్న విధంగా క్షోభ పడము.

మనకు ఒక గురువు వున్నప్పుడు మన ఆత్మ ఉన్నతి గురించి ఎందుకు కలత చెందాలి? ఒకరిని మనం గురువుగా స్వీకరించినప్పుడు, బాధ్యత ఆయనదిగాని మనది కాదు. మనలో ఏదైనా మార్పు వచ్చిందంటే అది గురుకృప ద్వారా జరిగినట్లుగా భావించాలి. దానికి మనం కారణమని అనుకుంటే, మనవల్లే అది జరిగిందని తలిస్తే "నేను" అన్న భావన బయటికి వచ్చి మన ప్రయత్నాలను విఫలం చేస్తుంది. అందుకే అంతా ఆయనకు వదలిపెట్టి, చింతించక ప్రతిదీ ఆయన నిర్ణయమని గుర్తించాలి.

చింతించడం ఆయన వంతు. మనకంటే అధికంగా మన పురోగతిపై ఆయన దృష్టి పెడతాడు.

## గురు-శిష్య సంబంధాలు

గురుశిష్య సంబంధాన్ని విడమరిచి చెప్పడం ఎవరికీ కుదరదు. ఒకరిని గురువుగా స్వీకరించి కొంతకాలం పాటు ఆ బాటలో నడుచుకున్నప్పుడు, ఆ ఆత్మీయమైన బంధాన్ని ఇతరులకు విశద పరచలేము. అది మామూలు భాషలో చెప్పడానికి కుదరనిది. గురువు చేయలేనిది ఏదీ వుండదు. గురువే దేవుడు, ఆయనే ఆత్మ, ఆయనే కృప. గురువు బాహ్యంగా వుండడు. ఇక్కడ, అక్కడ అన్ని చోట్లా వుంటాడు. ఆయనకు ప్రత్యేక రూపం వుండదు. కొన్ని సమయాల్లో గురువు ద్వారా అసాధారణమైన లాభాలు సంభవిస్తాయి.

వైష్ణవ సంప్రదాయం ప్రకారం, మనం ఎన్నో వేదాలు, గ్రంథాలు చదివి వుండవచ్చు. గురువు ద్వారా మాత్రమే జ్ఞానాన్ని ఆర్జించగలం. ఒక ఆచార్యుడు తప్పక వుండి తీరాలి. పుస్తక జ్ఞానం అనుభవాన్ని ఇవ్వదు.

శ్రీరామానుజులకు ఒక గురువు వుండేవారు. ఎన్నో గ్రంథాలు పఠించివుండినప్పటికీ ఒక గురువు నుండి ఉపదేశాన్ని పొందాలని రామానుజులు భావించారు. గురూపదేశం పొందాలంటే ఒక నియమాన్ని, క్రమశిక్షణను ఆచరించాలి. ఉపదేశం కావాలంటే కొన్ని కట్టుబాట్లను పాటించాలి. ఉపదేశం పొందడానికి నియమం ఒక పౌర్ణమితో మొదలౌతుంది. ఆ రోజున మామూలు

పరిమాణంలో ఆహారం తినాలి. ఆ తరువాత రోజూ ఆహారం తగ్గించి మితంగా తింటూ, అమావాస్య రోజున ఏమీ తినకుండ వుండాలి. మళ్ళీ ఈ పరిమాణాన్ని కొద్దికొద్దిగా ఎక్కువ చేస్తూ తరువాతి పౌర్ణమి నాడు మామూలు మోతాదులో భోజనం చేయవచ్చు. ఈ క్రమం అంతా గురువును బట్టి వుంటుంది. అలాగ నియమాన్ని పాటించిన తరువాత గురూపదేశాన్ని అర్థించాలి. అప్పుడు ఒక అమావాస్య లేదా పౌర్ణమి రోజున గురువు అతనికి తగిన మంత్రాన్ని ఉపదేశిస్తాడు.

శ్రీరామానుజులు ఎన్నుకున్న గురువు శ్రీరంగం నుండి మదురైకి ఇరవై మైళ్ళ దూరంలోని ఒకచోట వుండేవారు. ఆయన అక్కడికి నడిచి చేరినప్పుడు "నీవు ఇంకా ఉపదేశానికి తయారుగా లేవు. తరువాత రమ్మన్నారు. ఇలాగ గురువు రామానుజులను పదునెనిమిదిసార్లు పరీక్షించారు. ప్రతిసారి, ఆయన 15 రోజులకు ఒకసారి ఉపవాస దీక్షతరువాత వెళ్ళడం, గురువుగారు తిరిగి రమ్మనడం జరిగింది. ఆయనే నా గురువు. ఆయన కాకుండ వేరెవ్వరిని ఆశ్రయించను అని నిశ్చయించుకొని మంచి శ్రద్ధ గలవాడు గనుక రామానుజులు ఓపికతో అలాగే చేశారు. రామానుజుల తోటివారు ఆ మంత్రం ఏదో గొప్పదై వుంటుందని, తాము దాన్ని పొందే ఆశ ఏమీ లేదని అనుకున్నారు. వారు "నీ గురువు చాలా క్రూరుడై వుండాలి. ఇన్నిసార్లు మిమ్మల్ని ఊరికే త్రిప్పించుకున్నాడు" అని అన్నారు. రామానుజులు మాత్రం "నాకేమీ తెలీదు. ఏది మంచిదో నా గురువుకు తెలుసు" అని బదులిచ్చాడు.

## శ్రద్ధకు పరీక్ష

శ్రీరామానుజులు 18వ సారి వెళ్ళినప్పుడు అతని శ్రద్ధకు గురువు సంతోషించి, మంత్రోపదేశం చేశారు. మనకూ ఈ మంత్రం ''ఓం నమో నారాయణ'' అని తెలిసివుండవచ్చు గాని సంప్రదాయాన్ని అనుసరించి మంత్రాన్ని గురువుద్వారానే పొందాలి. గురువుగారి నోట విన్నది ఎంతో శక్తిమంతమైనదిగా వుంటుంది. దీక్ష ఆయన ద్వారానే గ్రహించాలి. రామానుజులు ఉపదేశం పొందడంతో ఎంతో సంతోషించాడు. ''ఈ మంత్రం నిన్ను ఈ జన్మలోనే కాదు, పై జన్మలో కూడ బాగా సంతోషపెడుతుంది. ఇది విశిష్టమైన మంత్రం, నిరంతరం జనం చేస్తూ వుండాలి. కాని ఇతరులకు దీన్ని తెలిపితే, నీవు చాలా బాధపడతావు. అంతేకాదు, నీవు నరకానికి పోతావు. ఈ ఉపదేశం అందరి కోసం కాదు'' అని గురువు హెచ్చరిక చేశాడు. అంటే సమర్థుడైన శిష్యునికి మాత్రమే ఈ మంత్రాన్ని సరియైన సమయంలో ఉపదేశించాలని ఉద్దేశం.

రామానుజుల వారి జీవితంలో ఒక ఆసక్తికరమైన విషయం జరిగింది. తమ గురువుగారంటే ఎంతో గౌరవం. అందుకే ఉపదేశం కోసం 18 పర్యాయాలు ప్రయత్నించారు. మరొక గురువును సంప్రదించే ఉద్దేశం అతనికి ఎప్పుడూ లేదు. రామానుజుల వారి స్నేహితులు, అభిమానులు మాత్రం ఆయనను కలిసిన ప్రతిసారి, మంత్రోపదేశం లభించినప్పుడు తమకు కూడ ఆ మంత్రాన్ని చెబితే, తాము కూడ ఉద్ధరింపబడతామని ప్రార్థించేవారు. ''సరే, తప్పకుండా చెబుతాను'' అని ఆయన చెబుతుండేవాడు.

మంత్రోపదేశం తీసుకున్న రోజున రామానుజులు తనలో ఇలా

అనుకున్నారు. "గురువుగారేమో ఇది చాలా శక్తితో కూడిన మంత్రమని, నాకు ఈ లోకంలోను పరలోకంలో కూడ శ్రేయస్సు నిస్తుందని చెప్పారు. అంతే కాకుండ దాన్ని మరెవరికి చెప్పరాదని, చెబితే నరకానికి పోతానని అన్నారు". రామానుజులలో మొదలైన సందిగ్ధత ఊహించుకోండి. మంత్రాన్ని అందరికీ బహిర్గతం చేసి గురుద్రోహి అనిపించుకోవడం ఇష్టం లేదు. కాని అదే సమయంలో శ్రీరామానుజుల మదిలో మరొక ఆలోచన వచ్చింది. ఇది అంత గొప్ప మంత్రమైతే, దాన్ని గనుక అందరూ తెలుసుకుంటే వాళ్ళు కూడ ఈ భూమి మీద, మరొక ప్రపంచంలో కూడ ఆనందంగా వుంటారు. ఈ మంత్రాన్ని అందరికీ తెలియజేస్తాను అని నిశ్చయించుకున్నాడు. కాని అంతలో మరొక ఆలోచన, గురువు గారిని మోసగిస్తే అతి ఘోరమైన గురు అపచారానికి పాల్పడతాను. తెరలు తెరలుగా వస్తున్న ఈ ఆలోచనలు, ఆయనను మానసిక వ్యథకు గురిచేస్తూ వచ్చాయి. చివరకు దేవాలయం పై భాగానికి ఎక్కి, "అందరూ ఇటురండి, మిమ్మల్ని సంతోషపెట్టే ఒక వార్త చెబుతాను. ఈ లోకంలోనే కాదు పరలోకంలో కూడ ఆనందంగా వుండే విషయం తెలుపుతాను. నా గురువుగారు బోధించిన మంత్రం ఏమిటో తెలుసా?" అంటూ అక్కడ గుమిగూడిన వారందరికి తాను ఉపదేశం పొందిన మంత్రాన్ని బిగ్గరగా చెప్పాడు.

## జగత్కల్యాణమే ధ్యేయం

అక్కడున్న వారందరూ మంత్రాన్ని తెలుసుకున్నారు. కాని మానవ స్వభావం విచిత్రమైనది. అందులో కొంతమంది గురువుగారి దగ్గరికి వెళ్ళి "మీ శిష్యుడు ఏమి చేశాడో తెలుసా? మీరు

రామానుజులకు ఉపదేశించిన మంత్రాన్ని మాకందరికీ బహిర్గతం చేశాడు'' అని వార్తను చేరవేశారు. శాస్త్రప్రకారం అలాగ అందరికీ తెలుపకూడదు కదా, అని రెచ్చగొట్టారు. కోపంతో రగిలిపోయిన గురువుగారు వెంటనే రామానుజులు వుంటున్న గుడికి వెళ్ళి ''ఇలా నన్ను మోసం చేస్తావని నేనెప్పుడు అనుకోలేదు. నీ శ్రద్ధకు మెచ్చి నీకు ఆ మంత్రోపదేశం చేశాను. ఈ చర్యవల్ల నీవు నరకానికి వెళ్ళవచ్చు కూడ'' అని ఆవేశం ప్రకటించారు. రామానుజులు భక్తితో ''మీకు నమస్కరిస్తున్నాను. మీరు నా గురువులు. మీ ఆజ్ఞను జవదాటాను. నేను నరకానికి వెళ్తానని నాకు తెలుసు. నేను ఇలాగ ఎందుకు చేశానని మీరు అడగవచ్చు. స్వామీ, మంత్రాన్ని ఉపదేశం పొందినప్పుడు, నాకు ఎంతో ఆనందమనిపించింది. అది అంత గొప్ప మంత్రమైనప్పుడు, దాన్ని నా వరకే ఉంచుకోకుండ ఇతరులకు కూడ తెలిపితే, వాళ్ళందరూ ఆనందాన్ని ఇక్కడ, పరలోకంలో కూడ ఆనందాన్ని పొందుతారు కదా. నేనొక్కడినీ నరకానికి వెళ్ళినా ఫరవాలేదనిపించింది నేను చేసినది తప్పే మన్నించాలి'' అన్నారు. అప్పుడు గురువు మొదట నాకు కోపమొచ్చిన మాట నిజమే ఇప్పుడు నీవు ఎంతటి అసాధారణమైన శిష్యుడివో నాకు అర్థమైంది.

నిజంగా ఈ విషయమై లోతుగా ఆలోచిస్తే గురువు మనల్ని పలు విధాలుగా మార్గదర్శనం చేస్తారని తెలుస్తోంది. ఇలాగ శిష్యులు, ఆశ్రితుల పట్ల గురువు చూపే అత్యంతమైన అభిమానం, క్షమ మనకు తెలిపే కొన్ని ఉదంతాలు కూడ వున్నాయి.

మహాభారతంలో కురుక్షేత్ర యుద్ధానికి ముందు దుర్యోధనుడు, అర్జునుడు ఒకే సమయానికి శ్రీకృష్ణుని వద్దకు సహాయాన్ని అర్థిస్తూ వెళ్ళారు. అప్పుడు శ్రీకృష్ణుడు తాను సూచించ

బోయే రెండింటిలో చెరి ఒకటిని ఎన్నుకొనమన్నాడు. ఒక పక్షానికి తన సైన్యము, మరొకరివైపు ప్రత్యక్షంగా వుంటాననీ, కాని తాను యుద్ధ సమయంలో ఆయుధాలు పట్టననీ, విశదపరచాడు. దుర్యోధనుడు శ్రీకృష్ణునిని సైన్యాన్ని తన పక్షాన కావాలన్నాడు. అర్జునుడు శ్రీకృష్ణునిని తన రథసారథిగా వుండమని వేడుకున్నాడు.

తన అభిమాని కోరికపై పార్థసారథిగా వ్యవహరించడానికి అంగీకరించాడు. ఈ రోజుల్లో కారులో మనం డ్రైవరు కంటే గొప్ప వారమని అనుకుని అతని ప్రక్కన కూర్చొనేందుకు నిరాకరిస్తాము. మరి కృష్ణుని నిర్ణయం ఎలాంటిదో గమనించండి.

## భక్తుని మాట చెల్లింపు అతి ముఖ్యం

విషయం తెలుసుకున్న భీష్ముడు యుద్ధ సమయంలో ఎలాగైనా శ్రీకృష్ణునితో ఆయుధం పట్టిస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు. భీష్ముడు మహాగొప్ప యోధుడు. ఇక భీష్ముడు జీవించివున్నంత కాలం యుద్ధంలో తాము గెలువలేమని అర్జునుడు, యుధిష్ఠిరునికి అర్థమై పోయింది. యుద్ధం తీవ్రమైనప్పుడు భీష్ముడు భీకరంగా పాండవుల వైపు రాసాగాడు. అర్జున, ధర్మరాజులు భయపడిపోతున్న సమయంలో రథం దిగి కృష్ణుడు శంఖ, చక్రాలతో భీష్ముని వైపు నడిచాడు. ''ప్రభూ, నీచే చంపబడడం కంటే గొప్పదేమీ వుండదు. నేను చాలా అదృష్టవంతుడిననుకుంటా'' అని భీష్ముడు తనలో తాననుకున్నాడు. భీష్ముడు అలాగ తయారై నిలబడిన సమయంలో, యుధిష్ఠిరుడు కృష్ణునితో ఆయుధం పట్టనని కృష్ణుడు చేసిన ప్రతిజ్ఞను గుర్తు చేశాడు. వెంటనే రథం వైపుకు కృష్ణుడు చిరునవ్వుతో తిరిగి వెళ్ళాడు.

నేలకొరుగుతున్న భీష్ముడు అమ్ముల పడకపై ఉత్తరాయణం కొరకు వేచివున్నాడు. ఆ సమయంలో ధర్మరాజు అందరూ వెళ్ళిపోయారు. నేను ఇక రాజ్యాన్ని ఏలను అంటే కృష్ణుడు "అది నీ ధర్మం, నీవు పరిపాలించి తీరాలి" అన్నాడు. "నాకు రాజ్యపాలనా కౌశలం తెలీదు. రాజుప్రజలను ఎలా ఏలాలి?" అని సందేహం వెలిబుచ్చాడు. "అది నేను చెప్పలేను. కాని చెప్పగల వ్యక్తి ఒకరున్నారు. అది భీష్ముడు ఒక్కడే" అని కృష్ణుడన్నాడు. ఈ విషయమై భీష్ముడిని ధర్మరాజు ప్రార్థించాడు. భీష్ముడు "నన్నెందుకు అడుగుతున్నావు? సాక్షాత్తు విశ్వప్రభువు, పురుషోత్తముడు ఇక్కడే వున్నాడు, ఆయనను అడుగు" అన్నాడు. అప్పుడు కృష్ణుడు ఎంతో దయతో "నన్ను ఎలాగూ జనం తలుచుకుంటారు. కాని ప్రజలు నిన్ను గుర్తుంచుకోవాలి. నీవు మానవుల్లో అత్యున్నతుడవు. వైరాగ్యం విషయంలో నీతో సమానమెవరూ లేరు" అన్నాడు. "నీతో సాధారణంగా మాట్లాడుతూ, హాస్యాలాడుతున్న కృష్ణుడు మనలాంటి వాడనుకుంటున్నావు. మనకందరికీ ఇన్ని విధాల సహాయపడి, సహకారం అందిస్తున్న అతడు పురుషోత్తముడు, సామాన్యుడు కాడు" అని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు.

కన్నీళ్ళు కారుతుంటే భీష్ముడు పురుషోత్తముని సుగుణాలను అందరూ వింటుండగా వర్ణించాడు. అదే "విష్ణు సహస్రనామం". స్వయంగా దాన్ని రచించి చెబుతున్నప్పుడు శ్రీకృష్ణుడు విన్నందున విష్ణు సహస్రనామం ఎంతో పవిత్రమైనది. పురుషోత్తముని అపార కనికరం నేను ఎప్పటికీ సంపూర్ణంగా తెలియజేయలేనని భీష్ముడు అంటూ, తన ప్రతిజ్ఞను, దాన్ని నిలబెట్టడానికి శ్రీకృష్ణుడు ఎలాగ

సహకరించినదీ విశదంగా చెప్పాడు. "ప్రభువు భక్తులకు సేవ చేస్తాడు. ఆ క్రమంలో దేనికైనా వెనుకాడడు. నామీద తనకున్న అపార కరుణ కారణంగానే రణక్షేత్రంలో అలా ప్రవర్తించాడు. శిష్యుని కోసం తనను కింపరచుకునేందుకు కూడ ప్రభువు సిద్ధమే" అని భీష్ముడన్నాడు.

అలాగే ఆదిశంకరాచార్యుల జీవితంలోని 'చండాల' సంఘటన కూడ మనకు భక్తుల పట్ల గురువు ప్రకటించే అపారమైన కరుణ ఎంత గొప్పదో తెలుపుతుంది. లోకశంకరుడైన ఆచార్యుడు తనను తాను తక్కువ చేసుకుని ఆధ్యాత్మిక సాధనలో ఎంత ఉన్నతులైనా సరే 'మాయ' వలలో పడకుండ జాగ్రత్తగా వుండాలన్న నీతిబోధ చేస్తారు. పిల్లల సంతోషం కోసం మనం విషయాలు తెలియవని వాళ్ళ దగ్గర నటించిన విధంగా శంకరులు ప్రవర్తించి వుండవచ్చు. తమ అపారమైన జ్ఞాన సముద్రాన్ని చూసి మనం భయపడకుండ మనకు మంచి-చెడులను బోధించడానికి తమను తాము నిందార్హులుగా పరిగణించబడే పరిస్థితులను కూడ సంతోషంగా ఎదుర్కొంటారు.

ఇతరుల పట్ల కనికరం వల్లనే రామానుజుల గురువుగారు అలాగ ప్రవర్తించి వుండవచ్చు. శ్రీరామానుజులు గురువు కంటే గొప్పవారని అనుకోవచ్చు. అది మన మనుమలు, పిల్లలకు మనకంటే ఎక్కువ తెలిసిన వాళ్ళున్నట్లు వుంటుంది.

గురుకృప అన్నది మనకు అర్థంకాని విషయం. అలాంటి సందర్భాలలో మనం ప్రేమించే వారి పట్ల మనం ప్రవర్తించే పద్ధతిని గురించి ఆలోచించాలి. వాళ్ళ ఆనందం కోసం మనల్ని మనం

కించపరచబడడానికి కూడ సంకోచించం. మన స్థాయిలోనే పరిస్థితి ఇలా వున్నప్పుడు, దైవిక స్థాయిలో మరెంత ఎక్కువగా వుంటుందో!

గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః

గురుస్సాక్షాత్ పరబ్రహ్మా తస్మైశ్రీ గురవే నమః

మనం శరణాగతి చెందితే గురువు ఏమేమి చేయగలడని తెలియబరిచే ఎన్నో కథలున్నాయి. గురువు ప్రభావంలోనికి వచ్చినప్పుడు అసాధ్యమన్నది ఏదీ వుండదు. ఏమి సంభవించినప్పటికీ, అది గురుకృప వల్లనేనని తెలుసుకుంటాం. గురువు కనికరం లేనివాడనీ, మనల్ని పట్టించుకోరనీ, ఎప్పుడూ చెప్పం. ప్రతి ఒక్కటి ఆయన ఇచ్ఛ వల్లనే జరుగుతోందని ఒప్పుకుంటాము. భగవాన్ అన్నట్లు, అది పులికోరల్లో ఇరుక్కున్నట్లే. ఒకసారి గురువు యొక్క అండ చేరామంటే ఇక తిరుగులేదు. ఆయన తల్లికంటే అధికమైన శ్రద్ధ మనపట్ల చూపుతాడు. తాను తోడుగా వున్నాననీ, ఏ చింతను పెట్టుకోవద్దనీ భరోసా ఇస్తాడు. ఇతరులు ఎన్నో సమస్యలు వున్నాయనుకొంటున్నప్పటికీ, ఆయన అనంతమైన కృప వల్ల మనం అలా భావించం.

హైదరాబాద్ శ్రీరమణ కేంద్రం వ్యవస్థాపకులైన **డా. కే.ఎస్.** గారి ప్రవచనాలలోని కొన్ని ఎంపిక చేసిన ప్రవచనాలను **"గ్రేస్ ఈస్ ఆల్వేస్ ఫ్లోయింగ్"** అనే రెండవ సంకలనము ద్వారా డా. కే.ఎస్. గారి సంస్మరణ దినోత్సవమైన 11.01.2021వ తేదీన శ్రీరమణ కేంద్రం అధ్యక్షులు ఆవిష్కరిస్తున్నారు. e-బుక్కు కేంద్రం వెబ్సైట్ www.sriramanakendram.org లో అదే రోజు నుండి అందు బాటులో ఉంటుంది. భక్తులు గమనించగలరు.

# శరణాగతి

(మౌంటెన్‌పాత్ (ఏప్రిల్-జూన్, 2017 సంచిక 54-2)లో "సరెన్డర్" అన్న శీర్షికతో ప్రచురితమైన సంపాదకీయంలో నుండి ఎన్నుకొనబడిన భాగాల సంక్షిప్త అనువాదం)

**అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి**

భాగవత పురాణంలోని 'గజేంద్రమోక్షం' వృత్తాంతం మనకందరికీ పరిచయమైనదే, భార్యలు, పరివారంతో సహా ఒక రోజు వేసవి తాపం తీర్చుకునేందుకు గజేంద్రుడు కోనేటిలో ప్రవేశించి భీభత్సం సృష్టించాడు. దానితో కోపగించిన మొసలి గజేంద్రుని కాలు పట్టుకుంటుంది. పట్టు విడిపించుకునేందుకు శతవిధాల, వెయ్యి సంవత్సరాలపాటు తన స్వంత శక్తినే ఆధారంగా చేసుకుని ప్రయత్నించిన గజేంద్రుని శ్రమ ఎందుకూ పనికిరాదు. ఆ స్థితిలో భగవంతుని కృప లేనిదే ఏ ప్రయత్నము సఫలం కాదన్న సత్యాన్ని గ్రహించిన గజేంద్రుడు భేషజాన్ని వీడి సంపూర్ణంగా ఆత్మ సమర్పణ చేసుకొనడంతో, ప్రత్యక్షంగా వచ్చిన విష్ణుమూర్తి గజేంద్రుని కాపాడతాడు.

గజేంద్రునిలాగ మనమూ మన సామర్థ్యము, ఆర్థిక స్తోమత, కుటుంబ సహకారం, హోదాలను నమ్ముకుని మొండి ధైర్యంతో ఉదాసీనంగా జీవిస్తూవుంటాము. ఆధ్యాత్మికపథంలో నడవదలచు కున్న మనం మొదట ఆ మార్గాన్ని గురించిన సత్యాలను తెలుసు కోవాలి. మన అభిప్రాయాలు ఏవో చెప్పుడు మాటల ఆధారంగా ఏర్పడినవని, యథార్థానికి అవి ఎంతో సత్యదూరమైనవని

గ్రహించాలి. స్వప్న స్థితిలోవలె మనం నిజజీవితంలో కూడ అలాగే నడుచుకొంటుంటాము. ఏదో ఒక ఉపద్రవం సంభవించినపుడే మనకు ఈ రెండింటి మధ్య తేడా గుర్తుకు వస్తుంది. ఇతరుల ప్రాపుతోనే మనం జీవించగలమన్న విషయం తెలియడమే గాకుండ, మానవ జీవిత గమ్యాన్ని గ్రహించి, ఎదురయ్యే ఒడుదుడుకులు, కష్టాలను అధిగమించడానికి ఒక ఉన్నత శక్తి యొక్క బలమైన సహాయం తప్పకుండ అవసరమని అప్పుడు తెలియవస్తుంది. మన నిస్సహాయతను ఒప్పుకున్నప్పుడే ఆధ్యాత్మికపథంలో తొలిమెట్టు ఎక్కినట్లుగా భావించాలి. మరొక విషయం ఏమిటంటే, భౌతిక జీవితం, ఆధ్యాత్మిక జీవితాల యొక్క ఉద్దేశాలు భిన్నమైనవి. అలాగే, ఈ రెండింటికి సంబంధించిన చట్టాలు (సూత్రాలు) కూడ భిన్నమైనవే. ఉన్నదంతా వదులుకుని, సాదాసీదా జీవనం గడపడం అన్నది ధనవంతుని దృష్టిలో అర్థం లేని వాదన. అందులో లాభం ఏముంది? లౌకిక ప్రయోజనాలపై ఆసక్తి వున్న వ్యక్తికి ఇది నష్టంతో కూడినదిగా తోస్తుంది. ప్రాపంచికపరమైన సంతృప్తి కంటే ఉన్నత లాభాలను దృష్టిలో పెట్టుకొన్న వ్యక్తికి, లౌకికంగా ఏర్పడే లాభాలు అన్నీ కష్టాలకూ సంజీవని ఔషధం వంటివి కావని తెలుసు. ఆ ఎఱుక ఎంతో గుణాత్మకమైనది. ఎందుకంటే అది మనకు సాధారణంగా ఎప్పుడూ అందుబాటులో లేని పరిస్థితులను కూడ మనం అదుపు చేయడానికి ప్రయత్నించడాన్ని వదులుకొనడం అన్న మాట. మద్యం లేదా ఇతర మాదకద్రవ్యాల వాడుకకు బానిసలైన వ్యక్తులు వాటి ప్రభావంలో వున్నప్పుడు తమ జీవితాలు తమ

అదుపులో వున్నాయన్న భ్రమలో, అన్ని బాధ్యతల నుండి విముక్తి చెందినట్లు ఆ కాస్త సమయంలో భావిస్తారు.

పరిణతి పొందిన స్థితిలో పాతబడిపోయిన ప్రవర్తనా ధోరణిని పూర్తిగా తోసిపుచ్చడమే శరణాగతి. సర్వోత్కృష్టమైన అనుభవాన్ని పొందిన తరువాత భగవాన్ అంతకు పూర్వంలో వలె జీవనాన్ని గడపలేనని కుటుంబ సభ్యులకు ఎలా విశదంగా చెప్పగలరు? అది వీలుకానందువల్లే ఏ వివరణ ఇవ్వకుండ ఇల్లు వదలి వచ్చేశారు. ఆయన గృహం నుండి పారిపోయి రాలేదు. తన విధి నిర్దేశించిన మార్గంలో ముందుకెళ్ళారు.

మన విషయంలో కూడ అట్లాంటిదే జరుగుతుంది. కొన్ని సమయాలలో మన ఆలోచనా పద్ధతులు, భావనలు పురాతనమైనవై నిరుపయోగమైనప్పుడు, మనకు బాధాకరమైనప్పటికి, వాటిని మాని క్రొత్తవాటిని అనుసరించాల్సి వస్తుంది. ఆ మార్పును అన్ని సమయాలలోను విశదీకరించలేకపోవచ్చు. ఆ పరిస్థితుల్లో రక్షణ, కుటుంబ బాధ్యతలు, ప్రాణసమాన సభ్యులు, హితులు, సామాజిక పరమైన నియమాలు, ఇవేవీ అడ్డురావు. అలాగే భగవాన్ విషయంలో అరుణాచలం పట్ల అపూర్వ ఆకర్షణ అన్ని ఇతర అంశాలను ప్రక్కకు నెట్టివేసింది. మరింక దేనినీ పరిగణనలోనికి తీసుకోనీయకుండ అరుణాచలం యొక్క అద్భుతశక్తి ఆయనను వశపరచుకుంది. అందుకే భగవాన్ చరిత్ర మనకు స్ఫూర్తిదాయక మైనదిగా వుండిపోతుంది.

అరుణాచలానికి శరణాగతి చెందడం ఏదో అన్నింటిని ఇష్టపూర్వకంగా వదలిపెట్టడంతో సమానమని భావించ వీలులేదు. ప్రపంచాన్ని చూడవలసిన కోణం నుండి దర్శింపజేసి అరుణాచలం, ఏది ముఖ్యం, ఏది కాదు అన్నదానిని ఎఱుకపరుస్తుంది. మనం ఎవరం అన్న అత్యల్ప భావనను వదలుకొనడంతో మన సాధారణ ఆలోచనా పరంపరలను, మూర్ఖంగా పట్టుకు కూర్చునే మన ధోరణిని నశింపజేసే ఒక అత్యున్నతమైన శక్తిని గిరి గుర్తింప జేస్తుంది. అంతా వదలుకొనడమన్నది ఒక భయానక ప్రక్రియ అయినప్పటికి, గురువు మన వెంటనే ఉంటారు.

మనపై కృప కలగాలంటే, మొదట మనలో నమ్మకం, విశ్వాసం చోటు చేసుకోవాలి. భగవాన్ కృప ఎల్లప్పుడూ ఉండేదే కాని అది మనకు లభ్యం కావాలంటే ఆ ప్రక్రియపై నమ్మకం ఉండాలి. అప్పుడే మనలో ఋణాత్మక (వ్యతిరేక) అలవాట్లు, వాసనలు, ధోరణులు, నశింపబడతాయి. నమ్మకం అంటే ఆలోచనా రహితంగా కాకుండ, ఓర్పు, నమ్రత, వినయాలతో ఆ ఉన్నత శక్తిని ఆహ్వానించడం. అలాగని, ఏదో ఒక బొమ్మలా స్తబ్ధుగా ఉండి స్వర్గద్వారాలు వాటంతట అవే తెరచుకుంటాయని కూర్చొని వుండడం కాదు. చిత్తశుద్ధితో మన సమ్మతిని తెలుపవలసి వుంటుంది. ఫలితం దక్కాలంటే మౌనంగా ఒక మంత్రాన్ని జపించినట్లు, శ్వాస తీసుకుంటున్న రీతిలో క్రమబద్ధంగా శరణాగతి స్వాభావికంగా జరగాలి.

మన అవగాహనకు అందని స్థాయిలో ఈ ప్రపంచంలోని శక్తులు పనిచేస్తుంటాయి. మనం దృష్టి కోల్పోయిన చిట్టెలుకల లాగ అలవాటైన గోడల వెంబడి సాగుతుంటాము. మెలకువలో ఉన్నప్పుడు మనం నడయాడే ఈ ప్రపంచం, స్వప్న, సుషుప్తి స్థితులలో మనకు అనుభవమయ్యే ప్రపంచం కంటే భిన్నం కాదు. మన జీవితాలకు మనం ఊహించేదానికంటే ఉన్నత ఆశయాలు ఉండాలని నమ్మితే, మన పరిమిత అవగాహనలతో ఆ దిశలో పురోగతి సాధ్యం కాదని, మన బుద్ధికంటే ఉన్నతమైన ఏదో ఒక శక్తికి శరణాగతి చెందాలని విశదమౌతుంది.

శ్రీమద్భాగవతంలో శ్రీకృష్ణుడు "నేను పూర్తిగా నా భక్తుల అధీనంలో ఉన్నాను. నేను నిజానికి స్వతంత్రుడిని అసలు కాను. లౌకికపరమైన కోరికలను తెంచుకున్న భక్తులు నా హృదయాన్ని అదుపులోనికి తీసుకుంటారు. ఒక్క నా భక్తుని మాటేమిటి. నా భక్తుల, భక్తుల, భక్తుడు కూడ నాకు అత్యంత ప్రీతిపాత్రుడు" అన్నాడు.

మన విషయంలో భగవాన్ భక్తులమైన మన మీద ఆయన ఎందుకు ఆధారపడి వుంటారు? ప్రేమ అనే బంధం (ముడి) విడగొట్టబడలేనిది. ఇక ఈ సంయోగంలో వేరుపడడమనే ప్రశ్న ఎలా ఉత్పన్నమౌతుంది? మన హృదయాలను, మనసులను, భగవాన్‌కు అంకితం చేసినప్పుడు ఆయన కూడ మనతో ఎడతెగని సంబంధం ఏర్పరచుకుని, మన అత్యవసర సమయాలలో మనల్ని నిస్సహాయులుగా వదలదు.

# శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు

## (శ్రీదేవరాజ ముదలియార్)

(గత సంచిక తరువాయి) అనువాదం: జి. శ్రీహరిరావు

ఉద్యోగం పోయినాక, వెల్లూరు వెళ్ళి అక్కడ వకీలుగా వకాల్తా మొదలు పెడదామనుకున్నాను. చిత్తూరును యింకొక వారం రోజులలో వదిలి వెళ్ళిపోతాననగా, అక్కడి జడ్జిగారూ, నా స్నేహితులూ ఆయన శ్రీ బట్లరుగారు నన్ను వెళ్ళవద్దని వారించారు. చిత్తూరులోనే వుంటే, నాకు 'అఫీషియల్ రిసీవరు' ఉద్యోగం తేలికగా వస్తుందనీ, మే 1936లో ఆ ఉద్యోగంలో వున్నవారు ఖాళీ చేసి వెళ్ళిపోతారు కనుక నన్ను అందులో భర్తీ చేసే అవకాశం వస్తుందనీ వారు నమ్మబలికారు. ఇంకా యితర స్నేహితులు కూడా నన్ను చిత్తూరు వదిలి వెళ్ళవద్దని వారించారు. దానితో నా వెల్లూరు ప్రయాణం మానుకున్నాను.

ఏ మాటకామాటే చెప్పుకోవాలి. 15 సంవత్సరాల క్రితం మానుకున్న వకీలు పని మళ్ళీ మొదలు పెట్టడం అంత తేలికైన పనికాదు. వారాలు గడిచి పోతున్నాయి కానీ ఏ పనీ చేతికి రావడము లేదు. నాకు ఆదుర్దా పెరిగిపోతోంది. ఏమి చేయాలో పాలు పోలేదు. అటువంటి మానసిక స్థితిలో, నా స్నేహితుడైన డా. పెరుమాళ్‌గారి సోదరి కారులో శ్రీ భగవాన్ దర్శనానికి వెళ్ళాను. ఉదయం వెళ్ళి, రాత్రి 8 గంటలకు చిత్తూరు తిరిగి వచ్చాను. ఆశ్రమంలో వున్నంత సేపూ శ్రీ భగవాన్ సన్నిధిలోనే గడిపాను. ఆదాయం సంగతే ఆలోచిస్తూ కూర్చున్నానని చెప్పాలి. రాత్రికి యింటికి వెళ్ళేసరికి,

నా కోసం యెవరో పని మీద వచ్చారని చెప్పారు. నేను లేనని తెలిసి వెళ్ళిపోయారని చెప్పారు. వాళ్ళే మరుసటి రోజు ఉదయం తిరిగి వచ్చారు. ఈ లోపల, ఊళ్ళో వున్న పెద్ద పెద్ద వకీళ్ళను సంప్రదించగా, వారు వీళ్ళ కేసు బాగోలేదనీ, గెలవడం కష్టమనీ చెప్పారట. కేసు వివరాలను నేను పరిశీలించిన పిమ్మట, వారి కేసు అంత బలహీనమైనదేమీ కాదనిపించింది. వాళ్ళు ఓడిపోతే, వారి దురదృష్టం వల్లనే కానీ, కేసు బలహీనతవల్ల కానీ, వకీలు చేతగానితనం వల్ల కానీ కాదనిపించింది. వచ్చిన క్లైంట్లు నామీద నమ్మకం వుంచి అప్పీలు వేశారు. నేననుకున్నట్లుగానే కేసు గెలిచాము.

ప్రభుత్వ వకీలుగా ఉద్యోగ విరమణ చేసిన తరువాత, నేను చేబట్టిన మొదటి కేసు యిది. నాకు రూ.75 ఫీజుగా లభించటమే కాక, క్లైంటుల దృష్టిలో నా పరపతి కూడా పెరిగింది. ఈ గెలుపు వల్ల నా మానసిక పరిస్థితిలో కూడా మంచి మార్పు వచ్చింది. మనస్సు చాలా తేలికపడింది. ఆ కేసు శ్రీభగవానే పంపించారని నా గట్టి నమ్మిక. వారి సన్నిధిలో నాకు పని కావాలని కోరుకున్నానో లేదో చిత్తూరులో యింటికి క్లైంటులు వచ్చారు నన్ను వెతుక్కుంటూ. నేను లేకపోవడం వల్ల మళ్ళీ మర్నాడు వచ్చారు. తరువాత నాకు 'అఫీషియల్ రిసీవర్' ఉద్యోగం కూడా వచ్చింది. కానీ ఆ పదవిలో చేరడానికి అనేక యిబ్బందులు యెదురయ్యాయి. ఆ ఇబ్బందులు మామూలుగా పరిష్కారమయ్యే యిబ్బందులు కావు. ఆ సమయంలో నేను మళ్ళీ శ్రీ భగవాన్ దగ్గరకు వెళ్ళడం సంభవించింది. వారి సన్నిధిలో కూర్చొని, మానసికంగా నేనెంతో మథనపడుతూ వారిని ప్రశ్నించుకున్నాను: 'నన్ను వెల్లూరు

వెళ్ళకుండా చిత్తూరులోనే ఉద్యోగం వస్తుందని ఎందుకు ఆపాలి? తీరా ఉద్యోగం వచ్చాక, నేను అందులో చేరకుండా, యీ అవరోధాలు యెందుకు కల్పించాలి? చివరకు శ్రీ భగవాన్ కరుణ వల్లనే నేనా ఉద్యోగంలో చేరగలిగాను.

1936 నుంచీ, నేను తరచుగా, నెలకొకసారిగా, శ్రీ భగవాన్ వద్దకు వెళ్ళటం మొదలుపెట్టాను. ప్రతిసారీ 3-4 రోజులుండ సాగాను. 1937లో శ్రీ భగవాన్ కరుణ ప్రస్ఫుటమయ్యే ఒక అద్భుతం జరిగింది. ఆ సంవత్సరం మా ఆఫీసు తనిఖీ జరిగింది. ఆఫీసులో నా గుమాస్తా చేసిన ఒక తప్పిదం వల్ల ఉండవలసిన రొఖ్ఖంలో రూ.70లు తరుగు కనిపించింది. విషయం తెలియగానే నేను తరుగును భర్తీ చేశాను కానీ చట్టరీత్యా అది నా తప్పిదంగా పరిగణించవచ్చు. అధికారులు, ఆ డబ్బును నేను తాత్కాలికంగా దుర్వినియోగం చేశానని అభియోగం ప్రవేశపెట్టవచ్చును. ఆ రోజు రాత్రి నేను చాలా మానసిక వ్యథననుభవించాను. ఆ ఉద్యోగం పట్ల నాకు పెద్ద అపేక్ష యేమీ లేదు. కేవలం నా స్నేహితుడు శ్రీ బట్లరు గారు యిచ్చిన సలహా మేరకూ, ఆయన బలవంతం వల్లా ఆ ఉద్యోగంలో చేరాను. ఉద్యోగం పోతుందనే భయం నాకు లేదు కానీ, అంత వరకూ నేను కాపాడుకుంటూ వస్తున్న నా వ్యక్తిగత నిజాయితీతనం మీద మచ్చపడుతుందనే భయం యెక్కువ బాధించింది.

ఆ రోజు రాత్రి శ్రీ భగవాన్ నాకు కలలో, బహు స్ఫురద్రూపి, ధైర్యశాలియైన ఒక బ్రాహ్మణ యువకుని వలె కనిపించి, నా వైపుకే వస్తున్న ఒక పెద్ద పామును సునాయాసంగా తీసి పక్కకు విసిరి పారేశారు. ఆ తనిఖీ వల్ల తయారు చేసిన నివేదిక నాకెట్టి బాధను

కలిగించలేదు. వేరెటువంటి వ్యాఖ్యలూ లేకుండా, నేనిచ్చిన సంజాయిషీని (గుమాస్తా వల్ల జరిగిన పొరపాటు) అధికారులు ఆమోదించారు. అది శ్రీ భగవాన్ కరుణ తప్ప వేరొకటి కాదనేది నా గట్టి నమ్మిక. ఈ సమయంలోనే శ్రీ భగవాన్, నాకు ఆశ్రమం తోనూ, తమతోనూ సాన్నిహిత్యం పెంచసాగారు. ఆశ్రమం మీద శ్రీ భగవాన్ భక్తుడయిన శ్రీ పెరుమాళ్ స్వామి చేసిన అభియోగాలు తనకు పరువు నష్టము కలిగించాయని ఒక వ్యక్తి తిరువణ్ణామల డిప్యూటీ మేజిస్ట్రేటు కోర్టులో కేసు వేయడం జరిగింది. ఈ పెరుమాళ్ స్వామి, ఒకప్పుడు శ్రీ భగవాన్‌కు గొప్ప భక్తుడు. కాలక్రమేణా, ఆయన సర్వాధికారికీ, ఆశ్రమానికీ బద్ధశత్రువై కూర్చున్నాడు. అతను తమిళంలో ఒక కరపత్రం ప్రచురించి, బహునీచమైన వ్యాఖ్యలు చేయుడము, యీ తగాదాకు మూలకారణమైంది. తను ప్రచురించిన కరపత్రాన్ని ఆశ్రమం పట్టించుకోకపోవడమూ, దానిపై యెట్టి వ్యాజ్యమూ వేయకపోవడం వల్ల, ఆ పత్రానికి ఆశించిన ప్రచారము లభించలేదన్నది, యీ కోర్టు కేసుకు మూలకారణము. ఈ సందర్భంగా శ్రీ సర్వాధికారి, యోగిరామయ్య, టి.ఎస్. రాజగోపాలయ్యరు గారు సేలం వెళ్ళి న్యాయాధీశులు సుందరం చెట్టియారుగారిని సంప్రదించారు. పెరుమాళ్ స్వామిని కోర్టులో యెదురుకొని సవాలు చేయడానికి న్యాయవాదిగా యెవరిని నియమించాలనే విషయంగా! యాదృచ్ఛికంగా కనిపించునట్లు శ్రీచెట్టియారుగారు నా పేరు సూచించారు. కానీ, యిదంతా శ్రీ భగవాన్ సంకల్పమే! చెట్టియారు గారి సూచన మేరకు, ఆ ముగ్గురూ చిత్తూరు వచ్చి నన్ను కలుసు కొని, యీ కేసు వాదించడానికి నేనే సరైన వాడినని చెట్టియారు

గారు చెప్పారని తెలియచేశారు. నాతో ఒక రోజుండి, కేసులో వాదించడానికి నన్ను నియమించారు. అంతవరకూ, నేను ఆశ్రమానికి యే పనీ చేయలేదు. శ్రీ భగవాన్ కరుణే, వారిని నా దగ్గరకు రప్పించింది. ఆ కేసు కొంచెము క్లిష్టతరమైనదే. ఒకవేళ నేను ఓడిపోతే, ఆశ్రమవాసులు కొందరు అందులో స్త్రీలు కూడా సాక్షులుగా కోర్టుకు లాగబడతారు.

ఆ పరిస్థితి అందరికీ యిబ్బందిగా పరిణమిస్తుంది. అందువలన నేను కొంచెము ఆదుర్దాగానే వున్నాను. కానీ, అదృష్ట వశాత్తూ, శ్రీభగవాన్ కరుణ వలన కేసు గెలిచాము. అవతలి పార్టీ, కేసును వెల్లూరులో జిల్లా మేజిస్ట్రేటు దగ్గరకు తీసుకువెళ్ళారు. అక్కడ కూడా కేసు నేనే వాదించి గెలిచాను. ఈ గెలుపు రూపంలో శ్రీ భగవాన్, నాకు ఆశ్రమానికి కొంతసేవ చేసే అవకాశాన్ని యివ్వబడమే కాక, ఆశ్రమాధికారులకు నాపై సద్భావం కలిగేలాగా కూడా చేశారు.

ఈ కేసుకు సంబంధించిన యింకొక చిన్న విషయం కూడా చెప్పాలి. ఆశ్రమాధికారులు యీ కేసుతో నా దగ్గరకు వచ్చినప్పుడు, నా పిల్లలు నాకు మంచి ఫీజు వస్తుందనుకున్నారు. ఆశ్రమం నుండీ ఫీజు తీసుకోవడమనే ఆలోచనే రాకూడదనీ, కేసుకు సంబందించిన దారి ఖర్చులు కూడా నేనే భరించాలని వారికి నేను విశదీకరించాను. కానీ నా పిల్లలు ఫీజు ఆశించినందువలన, నేను తిరువణ్ణామల నుండీ తిరిగి రాగానే, శ్రీ భగవాన్ నాకింకో కేసు పంపారు. దాని వలన నేను పెద్దగా చేసిన పని యేమి లేకపోయినా రూ.50 ఫీజు దక్కింది. ఒక్కరోజు కోర్టుకు వెళ్ళానంతే! *(సశేషం)*

# శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# శ్రీ కె.కె. నంబియార్

**మల్లాది ఫణిమాల**

1932వ సంవత్సరంలో శ్రీ కె.కె. నంబియార్ అనబడే కేరళ రాష్ట్రపు మళయాళీ భక్తుడు సేలంలో సివిల్ ఇంజనీర్ ప్రభుత్వో ద్యోగిగా ఉంటూ తిరువణ్ణామలైలో రోడ్లు వేయించారు. ఆయన మొట్టమొదట తారు రోడ్డును ఆసుపత్రి నుండి రమణాశ్రమానికి వేయించారు. శ్రీ కె.కె. నంబియార్‌గారి భక్తి అలాంటిది.

వారు 1932లో ఆశ్రమానికి రావడానికి మునుపు, "నేనెవరను" అనే పుస్తకానికి మళయాళ భాషలో అనువాదాన్ని చదివారు. 'సజీవ మహర్షి' గురించి ఆ పుస్తకంలో ప్రస్తావన ఉంది. ఈ పదాలు చదివి, శ్రీ కె.కె. నంబియార్ బిగ్గరగా నవ్వేశారు. ఎందుచేతనంటే మహర్షులు అనే వాళ్ళు వేల సంవత్సరాల క్రిందట ఉండేవారుగానీ, ఇప్పుడు ఉండటమనేది ఆయనకు నమ్మలేని విషయంగా గోచరించింది. ఈ కారణంగా పుస్తకంలో ఉన్న ఈ విషయాన్ని వారు నమ్మలేదు. సేలం డిస్ట్రిక్ట్ బోర్డ్ అధ్యక్షుడు, చెట్టియార్‌కి, ఈ విషయం చెప్పగా ఆయన తిరువణ్ణామలైలో ఒక మహర్షి ఉన్నట్టు ధ్రువపరచారు. వారిద్దరూ కలిసి శ్రీరమణాశ్రమం బయలు దేరి వెళ్ళారు. హాలులోకి వెళ్ళగానే శ్రీ నంబియార్ శ్రీ భగవానులకు సాష్టాంగ నమస్కారం చేసి, వారి యెదుట కూర్చున్నారు. శ్రీరమణులకు, నంబియార్‌గారికి మధ్య ఏ సంభాషణా జరగక పోయినా, రమణుల సన్నిధిలో అలౌకికమైన శాంతిని, ప్రశాంతతను

శ్రీ నంబియార్ అనుభవించారు. అలా ఒక గంట గడిచింది. చెట్టియార్ లేచివెళ్తూ, నంబియార్ గారికి, బయలుదేరే సమయ మాసన్నమయినదని సంజ్ఞ చేయగా, వారిరువురూ శ్రీరమణుల వద్ద సెలవు తీసుకుని బయలుదేరారు. శ్రీ రమణాశ్రమాన్ని విడిచే టప్పుడు, ఏదో ఆధ్యాత్మిక అయస్కాంతం శ్రీ నంబియార్‌ను ఆ రూపం వహించిన దైవత్వం వైపు ఆకర్షిస్తున్నట్లనిపించింది. "దేహం ముందుకు సాగుతున్నా, స్థిమితం లేని మనస్సు వెనక్కి పరుగెత్తు తోంది. గాలివాటుకి ఎదురుగా కేతనము వలె" అని నంబియార్ గారు వారి అనుభూతిని మహాకవి కాళిదాసు వర్ణించిన రీతిలో వర్ణించారు. శ్రీరమణుల సాన్నిధ్యంలో ఉన్న మాధుర్యాన్ని ఒకసారి గ్రోలిన నంబియార్‌గారు, ఇంకా తరచూ శ్రీరమణుల సన్నిధిలో ఉండగలగాలని ఎంతో గాఢంగా ప్రార్థించసాగారు. వారి ప్రార్థనను ఈశ్వరుడాలకించి, నార్త్ ఆర్కాట్ జిల్లా ఇంజనీర్‌గా తిరువణ్ణామలై కేంద్రంగా వారిని బదిలీ చేయించారు.

ఆశ్రమానికి వెళ్ళినప్పుడు ఒకసారి భిక్షకై ఆశ్రమం వారికి శ్రీ నంబియార్ కొంత పైకమిచ్చారు. ఈ విందులో ఆశ్రమవాసు లందరూ, సందర్శకులందరూ మాత్రమే కాక శ్రీరమణులు కూడా పాల్గొంటారని శ్రీ నంబియార్ ఎంతో సంతోషించారు.

భోజనశాలలో శ్రీ భగవాన్‌కి ఎదురుగా కూర్చునే అవకాశం నంబియార్‌కు కలిగింది. అప్పుడు నంబియార్‌ను చూచి శ్రీరమణులు ఎంతో దయతో చక్కటి మందహాసం చేశారు. శ్రీ భగవానులకు అంత దగ్గరగా కూర్చుని వారితో పాటు విందారగించి

నప్పుడు శ్రీ నంబియార్‌కు కలిగిన సంతోషాతిరేకం వర్ణించలేనిదని వారు అన్నారు.

1936లో శ్రీ కె.కె. నంబియార్ తిరువణ్ణామలైకి బదిలీ చేయబడ్డారు. ఆ సమయానికి శ్రీ రమణులతో ఆయన అనుబంధం అన్ని విధాలుగానూ, అన్ని కోణాలలోనూ బలపడింది. ఉదయభానుని రాకతో మాయమయే మంచువలె, సజీవమైన మహర్షి ఉండగలరా అనే సందేహం నంబియార్‌గారి మనసులోంచి మాయమైపోయింది. శ్రీరమణులతో వారికున్న వైఖరిలో ఎంతో పరివర్తన రాసాగింది. వారికి తీరిక వేళల్లో వేటకి వెళ్ళే అలవాటు వుండేది. కానీ శ్రీరమణుల వాత్సల్యపు నీడలో నంబియార్ గారి వైఖరిలో ఎంత మార్పు వచ్చిందంటే, ఇక వేటకి వెళ్ళి ఏ జంతువునూ చంపనని నిర్ణయించుకున్నారు. వారు వేటకి వెళ్ళటం పూర్తిగా విరమించుకున్నారు.

హొగినేకల్ అడవులలో ఒక లేడిని వారు చంపి, రహదారి బంగళాకు తీసుకు వచ్చినప్పుడు ఈ ఆకస్మిక మార్పు కలిగింది. ప్రక్క గదిలోనే బస చేస్తున్న స్వామీజీ, గద్గదస్వరంతో శ్రీ నంబియార్‌తో, "ఆ లేడి కళ్ళని చూడండి - ఎంత దయనీయంగా ఉన్నాయో! అమాయకపు జీవులను అలా చంపవద్దు" అని అన్నారు. ఆ విధంగా ఆ స్వామీజీ కలుగ చేసుకుని మాట్లాడటం సాక్షాత్తు శ్రీరమణులే మాట్లాడినట్లు వారికి అనిపించింది. ఒకసారి ఒక సంస్కృత శ్లోకాన్ని వ్రాసి, శ్రీ నంబియార్, శ్రీరమణులకు ప్రణమిల్లి, ఆ కాగితాన్ని వారి పాదాల చెంత సమర్పించారు. ఆ శ్లోక తాత్పర్యమిది. "నాకు వేరే ఆశ్రయం లేదు. ఓ రమణేశ్వరా! కాబట్టి

మీరే కృపతో నన్ను కాపాడాలి" అని శ్రీరమణులు ఆ కాగితాన్ని నంబియార్‌గారికి తిరిగిస్తూ, ప్రసిద్ధమైన ఒక శ్లోకాన్ని వారు అనుకరించిన తీరును గురించి ముచ్చటించారు. నంబియార్ తిరిగి కూర్చున్న తరువాత శ్రీ భగవానులు వారి వైపు తదేకంగా చూసి, దయామయమైన వారి వీక్షణంతో నంబియార్‌గారి మనస్సుకు ప్రశాంతతను చేకూర్చారు.

శ్రీరమణుల కృపా కటాక్ష వీక్షణం వల్ల శ్రీ నంబియార్‌కు శ్రీ భగవానుల పట్ల ఉన్న భక్తిప్రపత్తులు, విశ్వాసం అధికమౌతూ వచ్చాయి. శ్రీ భగవానులను దైవ సమానులుగా భావించి, నంబియార్ వారిని వారు అర్పించుకున్నారు. క్రమేపి, దేవాలయాలకి వెళ్ళటం, ఏవేవో ధార్మిక చర్యలు చేయటం పట్ల నంబియార్‌కు గల ఆసక్తి తగ్గసాగింది. తీరిక వేళల్లో వారు శ్రీ రమణాశ్రమం వద్దగానీ, యింటివద్దగానీ ధ్యానం చేసుకునేవారు.

ఒకనాడు హాలులో కళ్ళు మూసుకుని ధ్యానం చేసుకుంటూం డగా వారి శరీరమంతా బండబారిపోయినట్లు, శ్రీ నంబియార్‌కు అనిపించింది. ఈ విషయం శ్రీరమణులకు చెప్పగా, ఇటువంటి విషయాలను పట్టించుకోకూడదని, ఇంకా తీవ్రంగా ధ్యానం కొనసాగించాలని శ్రీరమణులు వారికి సెలవిచ్చారు.

శ్రీరమణాశ్రమానికి కట్టడాలకై కావలసిన సామగ్రినీ, పుస్తకాల అచ్చుకై కావలసిన కాగితాన్ని ఆశ్రమం వారు సంపాదించుకోవ టానికి శ్రీ నంబియార్ ఎంతో సహాయపడ్డారు. వారు శ్రీ మాతృభూతేశ్వర ఆలయ నిర్మాణంలో కూడా ఎంతో సహకరించారు. 1950 ఏప్రిల్ 2వ తేదీ రాత్రి శ్రీ నంబియార్‌కు

శ్రీరమణుల నిర్వాణ గదిలో పడుకొని ఇద్దరితో మాట్లాడుతున్నట్లు కల వచ్చింది. వారు, నంబియార్ బయట వేచియుండటం గమనించి, “నంబియార్ బయట ఉన్నారు. లోపలికి పిలవండి” అని ఎంతో వాత్సల్యంగా అన్నారు. శ్రీ నంబియార్ గదిలో అడుగు పెట్టగానే శ్రీ భగవాన్ మంచం దిగి, చేతికఱ్ఱ మీద ఆనుకుని, గది బయటకు నడిచారు. వారిని ఆ ఇద్దరు మరియు నంబియార్ గారు అనుసరించి ముందుకెళ్ళారు. శ్రీరమణులు ఆముగ్గురినీ మాతృభూతేశ్వర సన్నిధికి సమానాంతరంగా ఒక చోటుకి తీసుకుని వెళ్ళి తమ చేతికఱ్ఱతో ఒక చతురస్రాన్ని గీశారు. అది వారి సమాధి స్థలం కోసమే గీశారేమో అని శ్రీ నంబియార్‌కు అనిపించింది.

ఏప్రిల్ 14వ తేదీన శ్రీ భగవానుల మహా నిర్వాణం తర్వాత, సర్వాధికారితో సహా ఎందరో శ్రీ భగవాన్ సమాధి మాతృదేవి సన్నిధికి అనుబంధంగా ఉండటాన్ని నిరాకరించారు. శ్రీరమణులకు అంతకన్నా పెద్ద సమాధి ఉండాలని వారి వాదం. ఈ విషయమై శ్రీ నంబియార్‌కి ఆశ్రమ సర్వాధికారికీ చిన్న వాగ్వివాదాలు కూడా జరిగాయి. కానీ, అన్ని వ్యవహారాలు శాంతియుతంగా ముగిశాయి.

శ్రీరమణులు తమ భక్తుల ఆంతరంగిక ప్రార్థనలను కూడా తెలుసుకుని, వాటికి సమాధానాలు కూడ యిస్తారు అని శ్రీ కె.కె. నంబియార్ గారికి ఎన్నోసార్లు అనుభవం లోకి వచ్చిన విషయం. పరిపూర్ణమైన శరణాగతి చెందిన భక్తులకు శ్రీరమణులు స్వప్నాల ద్వారా గానీ, స్వప్న దర్శనం ద్వారాగానీ, ఇతరత్రాగానీ దారి చూపుతూనే ఉంటారు.

* * * *

# The Kingdom of Happiness is Within

Talk 55

Dr. K. Subrahmanian

In our daily lives, we are busy with something or the other; we keep ourselves constantly occupied. In general, we are dissatisfied with ourselves and our life, and look forward to a time when we will be free from all responsibilities. Everyone has this feeling of being harassed almost every day. Even on the few occasions when we are enjoyingourselves, and are very happy, we suddenly wonder how long the happiness will last. We also pray that we should always be as happy as we are today.

When we are unhappy, we seek happiness; but when we are happy, we don't seek unhappiness. Even though we are unhappy much of the time, we look forward to a time when we will be really happy. A happy man will look forward to happiness, but an unhappy one, seeks happiness. Each person seeks it in his own way; some seek happiness through money, some through fame, some through their children, their wife, etc. It varies from person to person. All of us seek happiness because happiness is our true nature. Unhappiness, according to Bhagavan, is an aberration; bliss is our true nature, and we all can experience it without having to read the *Vedas*, the *Puranas*, etc. He said the moment you don't seek any pleasure from anything in this world, you will realize yourself. We realize that when we seek happiness through

anything outside of us, that happiness is temporary; it doesn't last long. When our happiness depends on something external, when the attitude of the thing outside of us changes, then our happiness also becomes our source of unhappiness. Bhagavan, therefore says, the most important thing is to seek happiness within you. Unfortunately, we seldom go within; the nature of the mind is to go outside.

